పసికన్నులకు వెలుగులు

- జీజీహెచ్ డైక్ సెంటర్‌లో పసికందులకు పరీక్షలు
- ప్రత్యేక శిబిరం ద్వారా రెటినా పరీక్షలు
- ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తున్న వైద్యులు

గుంటూరు మెడికల్: సర్వేంద్రియాణాం నయనం ప్రధానం అన్నారు పెద్దలు. శరీరంలోని అన్ని అవయవాల్లో నేత్రాలు చాలా ముఖ్యమైనవి. అందమైన ప్రపంచాన్ని కళ్లారా చూడాలంటే మనకు ఎలాంటి దృష్టి సమస్యలు లేకుండా చూపు సక్రమంగా ఉండాలి. అయితే, రెటినోపతి అనే కంటి జబ్బు వల్ల కంటి చూపును కోల్పోతున్నారు. ఈ జబ్బును ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేయించటం వల్ల కంటి చూపును పోకుండా కాపాడుకోవచ్చు. అప్పుడే పుట్టిన పసికందుల్లో రెటినోపతి అనే జబ్బు వచ్చి ఏ పాపం ఎరుగని పాత్తిళ్ల చిన్నారులు అంధులుగా మారుతున్నారు. అలాంటి పసికందులకు ఉచితంగా కంటి పరీక్షలు చేయించి కంటి చూపు పోకుండా ప్రభుత్వం కాపాడుతోంది.

డైక్ సెంటర్‌లో ఉచిత కంటి పరీక్షలు

గుంటూరు జీజీహెచ్ ఆవరణలో జిల్లా బాలల సత్వర చికిత్సా కేంద్రం (డైక్)లో నెలరోజుల వయస్సున్న పసికందులకు ఉచితంగా రెటినోపతి పరీక్షలు చేయిస్తున్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించి నూతన జీవితాన్ని ప్రసాదిస్తున్నారు. రాజమండ్రికి చెందిన గౌతమి ఐ ఇనిస్టూట్ వారు ప్రతి నెలా రెండుసార్లు గుంటూరు జీజీహెచ్ డైక్ సెంటర్‌లో పసికందులకు ఉచితంగా కంటి పరీక్షలు చేస్తున్నారు. కంటి స్క్రీనింగ్ పరీక్షల్లో ఏదైనా సమస్య ఉన్నట్లు గుర్తిస్తే వారిని తాడిగడప ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పతికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్నారు. సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు డైక్ సెంటర్‌లో సిబ్బంది అందుబాటులో ఉండి పసికందుల కంటి సమస్యలతోపాటుగా ఇతర సమస్యలకు సైతం పరీక్షలు చేయించి అవసరమైన వారికి ఉచితంగా లక్షలు ఖరీదు చేసే ఆపరేషన్లు చేయిస్తున్నారు. కంటి సమస్యలపై ఏమైనా సందేహాలు ఉంటే వైద్య సలహాల కోసం డైక్ సెంటర్ ఆప్టోమెట్రీషియన్ బుస్సా ప్రతాప్ కుమార్‌ను 9440144487 నంబర్‌లో సంప్రదించాలి.


పసికందులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది


కంటి పరీక్షల కార్డును అందజేస్తున్న ఆప్టోమెట్రీషియన్ ప్రతాప్‌కుమార్

ఈ సమస్యలుంటే తప్పనిసరిగా కంటి స్క్రీనింగ్ పరీక్షలు

డైక్ సెంటర్‌లో పసికందుల్లో రెటినోపతి వల్ల కంటి చూపు కోల్పోకుండా కాపాడేందుకు అవసరమైన స్క్రీనింగ్ పరీక్షలు 2023 డిసెంబర్ నుంచి చేస్తున్నారు. బరువు తక్కువగా పుట్టిన పసికందులకు, నెలల నిండకుండానే పుట్టిన పసికందులకు తప్పనిసరిగా రెటినోపతి పరీక్షలు చేయించాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి సమస్యలతో పుట్టే పసికందుల్లో నరాల వ్యవస్థ పూర్తి స్థాయిలో ఏర్పడక కంటి చూపుపై ప్రభావం చూపిస్తుందని వెల్లడించారు. బిడ్డ పుట్టిన 21 రోజుల నుంచి 30 రోజుల్లోపు కంటి స్క్రీనింగ్ పరీక్షలు చేయించటం ద్వారా కంటి చూపును కాపాడుకోవచ్చు. డిసెంబర్ నెలలో 46 మంది, 2024 జనవరిలో 50 మందికి, గురువారం 18 మంది అప్పుడే పుట్టిన నవజాత శిశువులకు కంటి పరీక్షలు చేశారు. ఎలాంటి బిడ్డలకు కంటి పరీక్షలు చేయించాలి, ఎప్పుడు చేయించాలి, ఎలా సమస్యలను గుర్తించాలనే విషయాలపై వైద్యులు, వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వడం ద్వారా పలువురు జీజీహెచ్‌కు పసికందులను కంటి పరీక్షల కోసం రిఫర్ చేస్తున్నారు.


కంటి పరీక్షల కోసం పిల్లలతో వచ్చిన తల్లులు

మా కంటి దీపాన్ని కాపాడారు



డిసెంబర్ 5న రెండో కాన్పులో ట్విన్స్‌కు జన్మనిచ్చా. పసికందు బరువు కేవలం 1.9 గ్రాములు ఉండటంతో జీజీహెచ్ వైద్యుల సలహా మేరకు డైక్ సెంటర్ బిడ్డకు కంటి స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. రెటినోపతి సమస్య ఉన్నట్లు డైక్ సెంటర్ వారు గుర్తించి ఎల్ వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి తరలించారు. వారం రోజుల క్రితం సుమారు లక్ష రూపాయల ఖరీదు చేసే కంటి ఆపరేషన్ చేసి మా బిడ్డ చూపు పోకుండా కాపాడిన వైద్యులకు, ఉచితంగా చేయించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మా ధన్యవాదాలు.

–మాదుగాని ప్రియాంక, గుంటూరు నగరంపాలెం

సద్వినియోగం చేసుకోవాలి



డైక్ సెంటర్ ద్వారా చిన్నారులకు చేస్తున్న రెటినోపతి స్క్రీనింగ్ పరీక్షల కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి. డైక్ సెంటర్ ద్వారా అప్పుడే పుట్టిన పసిబిడ్డల్లో వచ్చే వినికిడి సమస్యలు, ఆటిజం, దృష్టి సమస్యలు, న్యూరాలజీ సమస్యలు, దంతాల సమస్యలు, అభ్యసనా సమస్యలు, తలసీమియా, రక్తహీనత, విటమిన్–డి లోపాలు, పోషకాహార లోపాలు, అయోడిన్ లోపాల సమస్యలు ఇతర సమస్యలకు ఉచితంగా పరీక్షలు చేసి అవసరమైన వారికి ఆపరేషన్లు కూడా చేయిస్తున్నారు. లక్షల ఖరీదు చేసే గుండె ఆపరేషన్లు, కాక్లియర్ ఆపరేషన్లు సైతం ఉచితంగా చేస్తున్నారు. తల్లిదండ్రులు పిల్లల్లో ఉండే సమస్యలను ముందస్తుగా గుర్తించి తక్షణమే డైక్ సెంటర్‌ను సంప్రదించాలి.

–డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డైక్ సెంటర్ ఇన్‌చార్జి

క్లుప్తంగా

నేడు నగరపాలక సంస్థలో 'స్పందన'

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని పేర్కొన్నారు. సచివాలయాల్లోనూ ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన జరుగుతుందని, అక్కడ పరిష్కారం కాని సమస్యలపై నేరుగా తమకు అర్జీలు ఇవ్వవచ్చని ఆమె తెలియజేశారు.

వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ



నగరంపాలెం: ఆదరణ కోల్పోయిన వయో వృద్ధులు, దివ్యాంగులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గిరిధారి మిత్రమండలి అధ్యక్షుడు బవిరిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. కొత్తపేట సోమువారి వీధిలోని మండలి కార్యాలయంలో నెలవారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం 30 మంది వృద్ధులు, దివ్యాంగులకు ఉచితంగా బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండలి అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ వృద్ధులను ఆదుకునేందుకు దాతలు, సేవా సంస్థలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో మండలి కార్యదర్శి వలకలూరి శివరావు, పి.వి. సంజీవరావు, దిండు రాజశేఖర్, వాసవీ క్లబ్ గుంటూరు సిటీ అధ్యక్షుడు మేడ నాగరాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

అపోపా ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ



గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని ఆర్యవైశ్య అఫీషియల్స్–ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అపోపా) కార్యాలయంలో ఆదివారం 108 మంది పేదలు, వృద్ధులకు రూ.500 చొప్పున పెన్షన్ పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ కాటన్ వ్యాపారి చందోలు శివరామకృష్ణ ప్రసాద్, హెల్తీ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు మాజేటి రామారావు మాట్లాడుతూ పేదలకు ప్రతి నెలా పెన్షన్లతో పాటు నూతన వస్త్రాలను అందజేయడం మంచి పరిణామమని అన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. అపోపా ద్వారా పేదలను ఆదుకునేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వంకాయల జనార్దనరావు, అపోపా రాష్ట్ర కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, నగర అధ్యక్షుడు కె.వి.బ్రహ్మం, కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, మద్దిసాయి రమేష్, వివాహ వేదిక కన్వీనర్ కంచర్ల వెంకటేశ్వర్లు, రాచపూడి సుబ్బారావు కోటిరత్నం పాల్గొన్నారు.

మద్యపానంతో కుటుంబాల చిన్నాభిన్నం



గుంటూరు ఎడ్యుకేషన్: కుటుంబాలను చిన్నాభిన్నం చేసే మద్యపానాన్ని విడనాడాలని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి పేర్కొన్నారు. కృష్ణబాబు కాలనీలో కళాశాల ఎన్ఎస్ఎస్–3 విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా విద్యార్థినులు మద్యపానం, ధూమపానం, మత్తు పదార్థాలు, గుట్కా, పొగాకు వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. 21వ డివిజన్ కార్పొరేటర్ కె. గురవయ్య మాట్లాడుతూ మద్యపానం వల్ల కుటుంబాలు ఎంతో నష్టపోతాయని చెప్పారు. కార్యక్రమ నిర్వహణ అధికారి కె. సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ ప్రస్తుతం యువత ఎక్కువగా డ్రగ్స్, మత్తు కలిగించే ఆల్కహాల్ వంటి దురలవాట్లకు బానిసలుగా మారి, బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 50 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు 76వ సచివాలయం సిబ్బందితో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరుతూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి గోరంట్లలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు

గుంటూరు రూరల్: గోరంట్లలో ఈనెల 19నుంచి 22 వరకూ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ 22వ వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు గజవల్లి వెంకటప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులు స్వామిని దర్శించుకుని, ఆయన కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

జాతీయ పోటీల్లో మోహన రూపకు కాంస్యం



గుంటూరు వెస్ట్ (క్రీడలు): కేరళలోని కోజికోడ్‌లో ఈ నెల 16 నుంచి 18 వరకు జరిగిన సీనియర్ నేషనల్స్ ట్రాంపోలిన్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో గుంటూరుకు చెందిన మోహన రూపకు కాంస్య పతకం దక్కిందని కోచ్ పఠాన్ అఫ్రోజ్ ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బీఆర్ స్టేడియంలోని జిమ్నాస్టిక్స్ సెంటర్లో శిక్షణ పొందిందని పేర్కొన్నారు. మోహన రూప ఇప్పటి వరకు తొమ్మిది నేషనల్స్‌లో ఆడి ఉత్తమ ప్రతిభతో పాటు పలు పతకాలు సాధించిందని తెలియజేశారు.

కేంద్ర పథకాలపై గ్రామాల్లో ప్రచారం

గుంటూరు మెడికల్: కేంద్ర పథకాలపై గ్రామాల్లో వికసిత భారత్ కార్యక్రమం ద్వారా ప్రచారం చేస్తున్నామని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెలవర్తిపాటి పాండురంగ విఠల్ తెలిపారు. ఆయన ఆదివారం గుంటూరు లాల్‌పురం రోడ్డులోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌కు ఇస్తున్న అనేక సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేస్తున్నామని తెలిపారు. గతంలో చలో అభియాన్ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ప్రతి వ్యక్తిని కలిసి కేంద్ర పథకాల గురించి వివరించామని చెప్పారు. నేడు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న పథకాలను వికసిత భారత్ కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకు తీసుకెళ్తున్నామని తెలిపారు. కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఆయన కోరారు.

ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న బీజేపీ ప్రభుత్వం

సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

పాత గుంటూరు: ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా, హక్కుల కోసం రైతులు ఢిల్లీలో పోరాటం చేస్తుంటే డ్రోన్ ద్వారా అణచివేసే ప్రయత్నం చేయడం సిగ్గుచేటని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఖండించారు. గుంటూరు కొత్తపేటలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీలో పెద్దఎత్తున ఆందోళన జరుగుతుంటే దుబాయ్‌లో దేవాలయం ప్రారంభించే పనిలో మోదీ నిమగ్నమయ్యారని విమర్శించారు. అక్కడేమో శుభకార్యం, ఇక్కడేమో హింసాత్మకం చూస్తుంటే ఇంట్లో ఈగల మోత..బయట పల్లకీల మోత అనే చందంగా మోదీ వ్యవహారశైలి ఉందని తెలిపారు. రాముని పేరుతో ఓట్లు సంపాదించే పనిలో ఆయన పడ్డారని, జా సంక్షేమం కోసం పని చేసి ఉంటే దేవునితో పని ఏముంటుంది అని ప్రశ్నించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ఢిల్లీలో జరిగిన సమావేశంలో మన రాష్ట్రానికి సంబంధించిన ఏ ఒక్క అంశంపై కూడా ప్రస్తావించిన దాఖలాలు కనిపించలేదన్నారు. దేశంలో రైతులకు మేలు జరిగితే వారు ఢిల్లీలో పోరాటం ఎందుకు చేస్తారని ప్రశ్నించారు. ఉభయ కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో ఈ నెల 20న విజయవాడలో జరిగే సదస్సుకు వచ్చే అన్ని పార్టీలతో కలిసి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పాల్గొన్నారు.అనంతరం జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులను పరామర్శించారు.


సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతి ఒక్కరూ సందర్శించాలి

- వైఎస్సార్ సీపీ క్లస్టర్–2 అధ్యక్షుడు నూనె వెంకటేశ్వరరెడ్డి
- చిలకలూరు నుంచి ప్రారంభమైన యాత్ర -2

గుంటూరు రూరల్: సామాజిక న్యాయ మహాశిల్పంగా విజయవాడ నడిబొడ్డున ముఖ్యమంత్రి వైఎస్. జగన్ ఏర్పాటు చేసిన అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ప్రతి ఒక్కరూ సందర్శించాలని వైఎస్సార్ సీపీ నేతలు పిలుపునిచ్చారు. పార్టీ గుంటూరు క్లస్టర్ – 2 అధ్యక్షుడు నూనె ఉమామహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పెదపలకలూరు నుంచి విజయవాడకు సందర్శన యాత్ర-2 ప్రారంభమైంది. గుంటూరు రూరల్ ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు చైర్మన్ ఆళ్ల రవి దేవరాజు, వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం రాష్ట్ర నాయకుడు పోలూరి వెంకటరెడ్డి, నవ్యాంధ్ర ఎమ్మార్పీయస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు హేమప్రసాద్ తదితరులు మొత్తం 10 బస్సులకు జెండా ఊపి లాంఛనంగా యాత్రకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచం గర్వించదగ్గ అంబేడ్కర్ గొప్ప దార్శనికుడే కాకుండా సమాజంలో అసమానతలు రూపుమాపేందుకు జీవిత చరమాంకం వరకు కృషి చేసిన అందరివాడని కీర్తించారు. ఆయన స్ఫూర్తిని భావి తరాల్లో నింపేందుకు ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి గొప్ప చరిత్ర సృష్టించారని వెల్లడించారు. వినూత్నంగా అప్పిరెడ్డి-అంబేడ్కర్ యాత్రకు శ్రీకారం చుట్టి దశల వారీగా ప్రజలను అంబేడ్కర్ విగ్రహ సందర్శనార్థం సొంత ఖర్చులతో తీసుకెళ్తున్న నూనె ఉమామహేశ్వరరెడ్డిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ స్మిత పద్మజ, నల్లపాడు డివిజన్ అధ్యక్షుడు దుగ్గెంపూడి యోగేశ్వరరెడ్డి, దుగ్గెంపూడి బాలఅంజిరెడ్డి, పలకలూరు పార్టీ నేతలు జాని, రామకోటేశ్వరరావు, మరియబాబు, గోపి, మురళి, హుస్సేన్‌షా పాల్గొన్నారు.


జెండాలను ఊపి బస్సును ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

2న ప్రత్యామ్నాయ సంస్కృతి మేళా మహాసభ


కరపత్రాలు విడుదల చేస్తున్న దళిత సంఘాల నాయకులు

గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ పిలుపు మేరకు మార్చి 2న నగరంలోని వెంకటేశ్వర విజ్ఞాన్ మందిరంలో నిర్వహిస్తున్న ప్రత్యామ్నాయ సంస్కృతి మేళా మహాసభను జయప్రదం చేయాలని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పొగ్గల ప్రకాష్ పిలుపునిచ్చారు. రూరల్ మండలంలోని దాసరిపాలెం, అంకిరెడ్డిపాలెం, వెంగళాయపాలెం గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాల వద్ద ఆదివారం గ్రామ పెద్దలు, డ్వాక్రా మహిళలు, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభలో ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ వ్యవస్థాపక అధ్యక్షులు మహాకవి డాక్టర్ కత్తి పద్మారావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో దళిత మహాసభ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కొరబండి బాబూరావు, భీమ్ భారత్ రాష్ట్ర నాయకులు దొడ్డ రాజేంద్రప్రసాద్, గ్రామ పెద్దలు బోరుగడ్డ ఆనంద్, వై. ప్రభుదాసు, ఎం. సువార్తమ్మ, పి. దయామణి వై. అంజమ్మ పాల్గొన్నారు.

శ్రీ వైష్ణవి హాస్పిటల్స్ ప్రారంభం


హాస్పిటల్ ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని, పక్కన డాక్టర్ కిలారి సునీల్‌కుమార్, డాక్టర్ చంద్ర రాధికారాణి తదితరులు

గుంటూరు మెడికల్: స్థానిక కాకాని రోడ్డు బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ ఎదురుగా అధునాతన వైద్య సౌకర్యాలతో 100 పడకలతో నూతనంగా నిర్మించిన శ్రీ వైష్ణవి హాస్పిటల్స్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ఆదివారం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో విద్య, వైద్య, సంక్షేమం రంగాలు ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా ఉన్నాయని తెలిపారు. శ్రీ వైష్ణవి హాస్పిటల్స్ ప్రజల ఆదరాభిమానాలు పొందాలని ఆయన ఆకాంక్షించారు. క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ చంద్ర రాధికారాణి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, ట్రామా కేసులు, పాలి ట్రామా, కాలిన గాయాలు, క్రిటికల్ కేర్, పెయిన్ మేనేజ్‌మెంట్, ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యసేవలన్నీ ఒకే గొడుకు కిందకు తెచ్చి ప్రమాద బాధితుల ప్రాణాలు రక్షణే ధ్యేయంగా నూతన ఆస్పత్రిని ప్రారంభిస్తున్నామని చెప్పారు. సీనియర్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ డాక్టర్ కిలారి సునీల్ కుమార్ మాట్లాడుతూ ఆధునిక వైద్యసేవలు ప్రజలకు చేరువ చేయటమే లక్ష్యంగా ఆస్పత్రిని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో తూర్పు, పశ్చిమ శాసనసభ్యులు మహమ్మద్ ముస్తఫా, మద్దాళి గిరి, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులు, బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి, సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ, స్టేట్ సహాయ సెక్రటరీ ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీనియర్ సర్జన్ డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణ, నగరంలోని ప్రముఖ వైద్యులు పాల్గొని డాక్టర్ సునీల్ కుమార్ రాధికా రాణి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చంద్ర అచ్చమాంబ, రవీంద్ర దంపతులు, హైందవి, సంయుక్త, గరికపాటి రామ్మోహన్ రావు, చింతల రమేష్, మణికంఠ పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్టు

చేబ్రోలు: నిబంధనలకు విరుద్ధంగా గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని విక్రయిస్తున్న నలుగురిని చేబ్రోలు పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఒడిస్సా నుంచి చేబ్రోలు మండలం నారాకోడూరుకు గంజాయిని ప్రత్యేక వాహనంలో తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో దాడి చేసి నిందితులను పట్టుకున్నారు. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన ఇద్దరు, చేబ్రోలుకు చెందిన ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకొని వారి నుంచి పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రహస్యంగా నారాకోడూరు ప్రాంతానికి వస్తున్నట్లు పక్కా సమాచారంతో పోలీసులకు చిక్కారు. చేబ్రోలు, నారాకోడూరు, వడ్లమూడి గ్రామాల పరిధిలోని స్పిన్నింగ్ మిల్లు కార్మికులకు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు, యువతకు ప్రత్యేక బృందాల ద్వారా గంజాయిని రహస్యంగా విక్రయిస్తున్నట్లు తెలిసింది.

శ్రీవారి భక్త ఆత్మీయ సమ్మేళనోత్సవం

తెనాలి టౌన్: కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో గోవింద నామ జపయజ్ఞ పూర్ణాహుతి, వెంకటేశ్వర సప్తాహ వైభోత్సవాలు, శ్రీవారి భక్త ఆత్మీయ సమ్మేళనోత్సవం ఆదివారం నిర్వహించారు. భూ నీలా సమేత శ్రీనివాసస్వామికి 16రోజుల పండుగ, ఊంజల సేవ, శ్రీనివాస గణ పారాయణం, అన్నమాచార్య సంకీర్తనలు, గోవింద నామార్చనలు జరిపారు. మహా మంగళహారతి నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీ త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి (విజయవాడ) విచ్చేసి భక్తులకు ప్రవచనం చేశారు. సాలీగ్రామ మఠం ట్రస్ట్, శ్రీ విద్యాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో బాలస్వామిజీ పర్యవేక్షణలో కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు అన్నామాచార్య సంకీర్తనలు, గోవింద నామార్చనలు ఆలపించారు. కార్యక్రమంలో టీడీడీ దేవస్థానాల దాసా సాహిత్య ప్రాజెక్టు కృష్ణా గుంటూరు జిల్లాల అధ్యక్షుడు గడ్డిపాటి శ్రీనివాసరావు, సాలీగ్రామ మఠం ట్రస్ట్ చైర్మన్ నంబూరి వెంకటకృష్ణమూర్తి, సెక్రటరీ ఉప్పల నాగేశ్వరరావు, కోశాధికారి గోపు రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి ఎం.రమణయ్య, సభ్యులు పాల్గొన్నారు. శ్రీ విద్యాపీఠం సభ్యులు, జయలక్ష్మి మాతృమండలి సభ్యులు, పాతర్తూరి ఆదిలక్ష్మి శిష్య బృందం సభ్యులు ఆలపించిన సంకీర్తనలు విశేషంగా అలరించాయి. ప్రజ్ఞానంద సరస్వతి బాలస్వామీజీ పర్యవేక్షించారు.


ప్రవచనం చేస్తున్న త్రిదండి అష్టాక్షరీ రామానుజ జీయర్ స్వామి

సీనియర్ న్యాయవాది చంద్రశేఖర్ మృతి



తెనాలి రూరల్: తెనాలి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది కంచర్ల చంద్రశేఖర్(53) ఆదివారం అనారోగ్యంతో గుంటూరు సమగ్ర వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతదేహాన్ని ఆయన స్వగ్రామం కొలకలూరుకు కుటుంబ సభ్యులు తీసుకువచ్చారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మండలపు వేణుగోపాలరావు, కార్యదర్శి గౌరీశంకర్, ఇతర ప్రముఖ న్యాయవాదులు చంద్రశేఖర్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

25న హేతువాద అధ్యయన తరగతులు


తెనాలి: ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 25న విజయవాడలోని ప్రెస్ క్లబ్‌లో హేతువాద అధ్యయన తరగతులను నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హేతువాద నాస్తిక సాంస్కృతికోద్యమాల అవసరం, రాజ్యాంగం–పౌరహక్కులు–బాధ్యతలు, నాస్తికత్వం–ఆవశ్యకత, హేతువాదం–శాస్త్రీయత, మానసిక రోగాలు–శాస్త్రీయ వైద్యం, వాస్తు శాస్త్రీయమా? అనే అంశాలపై పౌర హక్కుల సంఘం ముప్పాళ్ల సుబ్బారావు, ముత్తేవి రవీంద్రనాథ్, డాక్టర్ ఇంట్ల రామసుబ్బారెడ్డి, ప్రొఫెసర్ కొడాలి శ్రీనివాస్ మాట్లాడతారని తెలిపారు. మూఢ నమ్మకాల నిర్మూలనతోనే సమాజం అభివృద్ధి చెందుతుందనే భావనతో ఏర్పాటు చేస్తున్న తరగతులను జయప్రదం చేయాల్సిందిగా కోరారు.

జనం వద్దకే వైద్య శిబిరం

డీ3 శారద సర్వీస్ సొసైటీ వినూత్న సేవ

తెనాలి: పట్టణానికి చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ డీ3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మార్కెట్ సెంటర్‌లోని అన్నాబత్తుని సత్యనారాయణ పుర వేదిక వద్ద వైద్య శిబిరం నిర్వహించారు. సంస్థ ధర్మ వాహనం ద్వారా ప్రజలకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ శారద నేతృత్వంలో మొత్తం 150 మందికి ఈసీజీ, షుగర్, బీపీ పరీక్షలు ఉచితంగా చేసి, అవసరమైన వారికి మందులు ఇచ్చారు. రోజువారీ కూలీలు, చిరు వ్యాపారులు, ముఠా కార్మికుల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ.. తమ వంతుగా వారి వద్దకే వచ్చి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మందులు, వైద్య సలహాలతో వ్యాధులు ముదరక ముందే నివారణకు తోడ్పడాలని భావిస్తున్నట్లు తెలిపారు. సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ అనుమతితో సాధారణ ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రదేశాల్లో వైద్య శిబిరాల నిర్వహణకు పూనుకున్నట్లు చెప్పారు. రైతు బజార్లు, జన సంచారం ఎక్కువగా ఉండే కూడళ్లలో మరో అయిదారు రోజులు వైద్య శిబిరాలు నిర్వహించి, నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కత్తి పద్మారావుకు సన్మానం



మంగళగిరి: దళితులు, బడుగు బలహీనవర్గాల అభివృద్ధి కోసం తన రచనలతో తన జీవితాన్ని జాతికి అంకితం చేసిన కత్తి పద్మారావు అభినందనీయులని ఏపీ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంఘం ప్రతినిధులు కొనియాడారు. తాడేపల్లిలోని కార్యాలయంలో కత్తి పద్మారావును ఆదివారం అధికారుల సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఎం.సునీల్ కుమార్, కొత్తపల్లి వెంకటరమణ, భాస్కర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.